సాక్షి చిత్తూరు

బుధవారం । 4 । జూన్ । 2025



టీబీపై అప్రమత్తం

టీబీపై అప్రమత్తంగా ఉండి, ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ కోరారు. - 8లో



సైక్లింగ్‌తో ఆరోగ్యం

ప్రతి ఒక్కరికీ వ్యాయామం తప్పనిసరని, సైక్లింగ్ ఆరోగ్యానికి మంచి టానిక్ అని ఎస్పీ సతీమణి హర్షిత అన్నారు. - 8లో



విత్తనంపై పెత్తనం

వేరుశనగ విత్తన పంపిణీపై స్థానిక ప్రజాప్రతినిధులు పెత్తనం చేస్తుండడంపై సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

వెన్నుపోటు దినంకు వెళ్లొద్దని బెదిరింపులు

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో బుధవారం వైఎస్సార్‌సీపీ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన వెన్నుపోటు దినంకు వెళ్లొద్దని టీడీపీ నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారు. నగరంలోని పలు డివిజన్‌లలో ప్రజలను కార్యక్రమానికి వెళితే పరిణామాలు వేరేలా ఉంటుందని భయ బ్రాంత్రులకు గురిచేశారు. ప్రధానంగా మహిళలు, యువకులను టార్గెట్ చేశారు. అలాగే గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాల్లో కూడా బెదిరింపు ధోరణిని అవలంబించారు. వెన్నుపోటు దినానికి వెళ్లే వారికి పథకాల్లో కోతలు పెడుతామని, రేషన్, పింఛన్ ఆపేస్తామని భయపెట్టారు.

నేడు, రేపు బాస్కెట్ బాల్ పోటీలు



మాట్లాడుతున్న చెంగల్రాయనాయుడు

చిత్తూరు కార్పొరేషన్ : బాస్కెట్ బాల్ రాష్ట్ర స్థాయి అండర్–23 చాంపియన్‌షిప్ పోటీలు బుధ, గురువారాల్లో నిర్వహించనున్నట్లు ఏపీ బాస్కెట్ బాల్ సంఘం అధ్యక్షుడు చెంగల్రాయనాయుడు తెలిపారు. నగరంలో మంగళవారం వివరాలను విలేకరులకు తెలియజేశారు. చిత్తూరులోని మెసానికల్ మైదానంలో ఈ పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు. పురుషులు, మహిళల విభాగంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఈసారి చిత్తూరులో నిర్వహిస్తున్నారన్నారు. టోర్నీ విజేతలకు చిత్తూరులోనే శిబిరం ఏర్పాటు చేసి జాతీయ స్థాయి పోటీలకు శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం రాష్ట్ర జట్టు కేరళ రాష్ట్రం కొచ్చిలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటుందని వెల్లడించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి పాల్గొన్నారు.

రేపు మొక్కలు నాటే కార్యక్రమం

చిత్తూరు కార్పొరేషన్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అటవీ ప్రాంతంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ సుమిత్‌కుమార్, డీఎఫ్ఓ భరణి, ప్రజాప్రతినిధులు వస్తారని ఎఫ్ఆర్వోలు బాలకృష్ణారెడ్డి, థామస్ తెలిపారు. పెనుమూరు క్రాస్ వద్ద గల నీవానగర వనంలో 9.30 గంటలకు మొక్కలు నాటుతారన్నారు. పలు అంశాల పై విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేస్తారని తెలిపారు. అనంతరం నగరంలోని పిల్లల పార్కులో కలెక్టర్ నిధులతో ఏర్పాటు చేసిన ఆట వస్తువులను ప్రారంభించి, మొక్కలను నాటనున్నట్లు వివరించారు.

ఐజీ పేరిట నకిలీ మెయిల్

చిత్తూరు అర్బన్ : రాష్ట్ర హోంగార్డు ఐజీ పేరిట నకిలీ మెయిల్ పంపిన ముబారక్ అనే వ్యక్తిపై చిత్తూరు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. చిత్తూరు నగరం మిట్టూరుకు చెందిన ముబారక్ అనే వ్యక్తి తాను హోంగార్డుగా పని చేస్తున్నట్లు ఓ నకిలీ సర్టిఫికెట్‌ను తయారు చేసుకున్నాడు. ప్రస్తుతం పోస్టింగ్ లేకుండా ఖాళీగా ఉన్నట్లు.. అతనికి వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని చిత్తూరు స్పెషల్ బ్రాంచ్ కార్యాలయానికి ఐజీ పేరిట ఓ మెయిల్ వచ్చింది. దీన్ని తనిఖీ చేసిన అధికారులు ఐజీ పేరిట వచ్చిన మెయిల్ నకిలీదని నిర్ధారించుకున్నారు. చిత్తూ రు స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ దేవప్రసాద్ ఫిర్యా దు మేరకు ముబారక్ తదితరులపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు చర్యలు



మాట్లాడుతున్న ఏపీసీ వెంకటరమణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంచేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వెంకట రమణ తెలిపారు. మూడు రోజుల పాటు హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్లకు నిర్వహించే ప్రత్యేక శిక్షణను ప్రారంభించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గిరింపేట నగరపాలక పాఠశాలలో ప్రారంభించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏపీసీ మాట్లాడుతూ.. ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణ నిర్వహించనున్నామన్నారు. విద్యార్థుల స్వయం మూల్యాంకన ప్రక్రియ, టీచర్ల హ్యాండ్‌బుక్స్, లీప్ యాప్ అమలు విధానంపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎస్సీఈఆర్టీ అబ్జర్వర్ నరసింహులు, డైట్ అబ్జర్వర్ మోహన్‌రెడ్డి, ఎంఈవోలు, కోర్స్ ఇంచార్జి, డీసీఈబీ సెక్రటరీ హేమాద్రి, హెచ్‌ఎంలు, ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

సూపర్ వంచన

ఎన్నికల ముందు టీడీపీ సూపర్‌సిక్స్ హామీలంటూ ప్రజలను బురిడీ కొట్టించింది. కూటమి ప్రభుతం కొలువుదీరి ఏడాది పూర్తవుతోంది. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైంది. సూపర్ సిక్స్‌లో ఏ ఒక్కటీ అమలు చేసి ఉంటే ఒట్టు..హామీల ముసుగులో గద్దెనెక్కిన చంద్రబాబు సూపర్–6 హామీలు నెరవేర్చాలంటే భయమేస్తోందంటూ ప్లేటు ఫిరాయించేశారు. దీంతో ప్రజలు మోసపోయాం బాబూ అంటూ నెత్తినోరు కొట్టుకుంటున్నారు.

- కూటమి ఏడాది పాలనలో హామీలు గాలికి
- ప్రజాసంక్షేమం గాలికొదిలేసిన సర్కారు
- అవినీతి, మోసం, కుట్రతో కూటమి పాలన
- నేడు వెన్నుపోటు దినంకు పిలుపునిచ్చిన వైఎస్సార్‌సీపీ

అమ్మ ఒడి నిధుల పంపిణీ కార్యక్రమంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ (ఫైల్)





చిత్తూరు కలెక్టరేట్ : హామీల ముసుగులో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైంది. సూపర్–6 హామీలు నెరవేర్చాలంటే ఖజానాలో డబ్బులు లేవంటూ చంద్రబాబు ప్లేట్ ఫిరాయించేసరికి ప్రజలు అవాక్కయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా హామీలను అమలు చేయకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి వెన్నుపోటు పాలనకు నిరసనగా వైఎస్సార్‌సీపీ బుధవారం వెన్నుపోటు దినంగా ప్రకటించింది. వెన్నుపోటు దినం కార్యక్రమంలో కూటమి పాలనలో మోసానికి గురైన ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనేందుకు సిద్ధమయ్యారు.

ఎన్నికలు వచ్చాయంటే గాల్లో మేడలు..

ఎన్నికలు వచ్చాయంటే చాలు చంద్రబాబు గాల్లో అద్దాల మేడలు కట్టేస్తారు. తీరా అధికారంలోకి వచ్చాక ఓట్లేసి గెలిపించిన ప్రజలను పక్కన పెట్టి తన నిజ స్వరూపం చూపిస్తారు. ఈసారి అధికారంలోకి వచ్చిన కూటమి టీడీపీ గతం లానే ప్రజలను నయవంచనకు గురి చేసింది. ఎన్నికలకు ముందు సూపర్‌సిక్స్ అంటూ ఊరూరా తిరిగి ఉదరగొట్టారు. ఆ పార్టీ నాయకులను ఇంటింటికీ పంపించి కరపత్రాలను పంచారు. అంతే కూటమి టీడీపీ గద్దెనెక్కాక ఆ పార్టీ మేనిఫెస్టో మాయమై పోయింది.

గొప్పలు చెప్పారు.. గొయ్యితీసి పాతి పెట్టారు..

- జిల్లాలో గత ఏడాది మే నెలలో పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గంలో చంద్రబాబు ప్రచారం నిర్వహించారు. సూపర్ 6 పథకాలు కావాలంటే టీడీపీకే ఓటెయ్యాలి. కేంద్ర ప్రభుత్వ నిధులను తీసుకొచ్చి చిత్తూరు అభివృద్ధికి కృషి చేస్తా. టీడీపీ అధికారంలోకి వస్తే వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తా. సూపర్ 6 పథకాలు అమలు చేసి తీరుతామని స్వయాన ప్రస్తుత సీఎం చంద్రబాబు హామీలు ఇచ్చి గొప్పలు చెప్పారు. హామీలు ఇచ్చి ఇప్పటికి ఏడాది అవుతున్నా ఆ హామీలు ఏమయ్యాయో ఆయనకే తెలియాలి.
- పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ గత ఏడాది ఏప్రిల్ 20వ తేదీన పూతలపట్టు నియోజకవర్గం తవణంపల్లెల్లో పర్యటించారు. ఆ పర్యటనలో ఇంటింటికి వెళ్లి సూపర్ 6 పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా సరే వారందరికీ తల్లికి వందనం పథకం నగదు అందజేస్తాం. నమ్మి ఓట్లు వేయండి.. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అందజేస్తామన్నారు. ఏడాది పూర్తి అవుతున్నా తల్లికి వందనం పథకం ఎక్కడ అని ఆ నియోజకవర్గ ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.



జగనన్న తోడు మెగా చెక్కును మహిళలకు అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

- గత ఏడాది ఏప్రిల్ 26 వ తేదీన గుడిపాల మండలం ఎన్నికల ప్రచారంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పాల్గొన్నారు. ఆ ప్రచారంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతుకు ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసి రూ.20 వేలు సాయం అందజేస్తామన్నారు. చిత్తూరు నియోజకవర్గంలో సంక్షేమ పథకాలు అమలు కాక రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. కూటమి రైతులకు ఇచ్చిన హామీలను మాత్రం అమలు చేయలేదు.
- గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ప్రతి మండలంలో సూపర్ 6 పథకాల పై ఎమ్మెల్యే థామస్ ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తమ అధినేత చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేస్తారంటూ గొప్పలు చెప్పారు. ఏడాది పూర్తి అవుతుండడంతో ఎన్నికల ప్రచారంలో చెప్పిన హామీలు ఏమయ్యాయి సారూ అంటూ ఆ నియోజకవర్గ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.
- గత ఏడాది ఏప్రిల్ 20వ తేదీన పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఇంటింటికి వెళ్లి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉంటుందని ఉదరగొట్టారు. ఇప్పటికీ ఏడాది పూర్తి అవుతున్నా ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణం ఊసే లేకపోవడంతో ఆ నియోజకవర్గంలో మహిళలు పెదవి విరుస్తున్నారు.
- నగరి నియోజకవర్గం నింద్ర మండలం లో గత ఏడాది ఏప్రిల్ 22వ తేదీన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పాల్గొని నిరుద్యోగులకు హామీలు ఇచ్చారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. అప్పటి వరకు ఉన్నత చదువు చదివిన ప్రతి యువకుడికి ప్రతి నెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ఏడాది పూర్తవుతున్నా ఉద్యోగాలు లేవు.. నిరుద్యోగ భృతి జాడే లేదు.

పంటల సాగుకు పెట్టుబడి ఇవ్వండి



పంట సాగుకు పడే తిప్పలు అన్ని ఇన్నీ కావు. తొలకరి వర్షాలు పడుతున్నాయి. అప్పటి సీఎం జగన్ ఉన్నప్పుడు క్రమం తప్పకుండా రైతు భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేల రూపాయలు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు పైసా అందలేదు. – దాస్, చిన్నలూర్, నగరి మండలం

ఇంటి స్థలాలు ఏవీ..



ఓట్ల కోసం ఎన్నికల సమయంలో అమలుకు నోచుకోని హామీలు ఇచ్చి ఏమి లాభం. ప్రజలను మభ్యపెట్టేందుకు ఇలాంటి వెన్నుపోటు రాజకీయాలు సరికాదు. మూడు సెంట్ల ఇంటి స్థలం ఇస్తామంటూ పేద ప్రజలను నిలువునా మోసం చేశారు.

– శోభన్ బాబు, కత్తెరపల్లి, కార్వేటినగరం మండలం

ఉచిత బస్సు ఇంకెప్పుడిస్తారు..



అధికారంలోకి వచ్చి ఏడాదవుతోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని ఎన్నికల ప్రచారంలో చెప్పారు. ఇప్పుడేమో ఆ ఉచిత ప్రయాణం ఎప్పుడో చెప్పే నాథుడే లేరు. ఇలాంటి అమలు కాని హామీలు ఎందుకు ఇవ్వాలి. మోసం చేసే విధంగా హామీలు ఇవ్వడం సరైంది కాదు.

– దీప, పాలసముద్రం మండలం



జిల్లా పర్యటనలో చంద్రబాబు ప్రకటించిన సూపర్ 6 హామీల పై వార్తల క్లిప్పింగ్

అవినీతి..అక్రమాలే ప్రాధాన్యం

- కూటమి పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి మేలు చేయాల్సింది పోయి అధికారంలోకి రాగానే రాజకీయ కక్షకు తెరలేపారు. వలంటీర్లకు ఇచ్చిన హామీని అమలు చేయకుండా ఉద్యోగాల నుంచి తొలగించారు.
- సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహించే కుప్పం మూడు రాష్ట్రాల కూడలిగా ఉండడంతో ఈ కూటమి పాలనలో టీడీపీ నేతల స్మగ్లింగ్‌కు అడ్డాగా మారింది. అక్కడ టీడీపీ శ్రేణులు చేస్తున్న దందాలకు అడ్డూ అదుపే లేకుండా పోతోంది. గ్రానైట్, కృత్రిమ ఇసుక, తమిళ బియ్యం, జల్లికట్టు పందేలు, పలు అక్రమ వ్యాపారాలు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారు.
- గత ప్రభుత్వంలో పలమనేరు వద్ద మొత్తం 2,088 ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ కారిడార్‌ను నిలిపేశారు.
- ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ప్రైవేట్ దుకాణాలను ఏర్పాటు చేసి జిల్లాలో దాదాపు 500 మంది చిరుద్యోగులు పొట్టకొట్టింది.
- జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ వద్ద రూ.20 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కొట్టేసేందుకు కూటమి నేతలు కన్ను వేసి కబ్జాకు యత్నించారు. అదే విధంగా కొత్తబస్టాండ్ వద్ద ఉన్న రూ.40 కోట్ల విలువ చేసే మత్స్యకార ప్రభుత్వ భవనానికి చెందిన స్థలాన్ని కొట్టేసేందుకు స్కెచ్ వేశారు.
- అన్న క్యాంటీన్ భవనాల రిపేర్ల పేరుతో తెలుగు తమ్ముళ్ల జేబుల్లోకి ప్రభుత్వ నిధులను వేసుకున్నారు. రూ.3 లక్షలయ్యే రిపేర్లకు రూ.13 లక్షలు నుంచి రూ.20 లక్షలు చూపించి అక్రమంగా ప్రభుత్వ నిధులు కొట్టేశారు. ఈ అన్నా క్యాంటిన్ల అక్రమ తంతు జిల్లాలోని 16 క్యాంటిన్‌లలో సాగించారు.

నేడు ఊరూరా వెన్నుపోటు దినం

- కూటమి మోసాలపై వైఎస్సార్‌సీపీ నిరసన
- నేడు ఆందోళనకు సిద్ధమైన పార్టీ శ్రేణులు

చిత్తూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజలను అబద్ధపు హామీలతో మోసగించి, ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బుధవారం వైఎస్సార్‌సీపీ వెన్నుపోటు దినంను నిర్వహిస్తోంది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపుతో జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ సమన్వయకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని నిరసనలు చేపడుతున్నారు.

నిరసనలు తెలిపే ప్రాంతాలు ఇవే..

- చిత్తూరులో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటలకు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ర్యాలీ ప్రారంభమవుతుంది. వేలూరు రోడ్డుపై పాదయాత్రగా కలెక్టరేట్ కార్యాలయం వద్దకు చేరుకుంటారు. అక్కడ నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తారు.
- పుంగనూరులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో ఉదయం 9 గంటలకు పట్టణంలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించి ర్యాలీగా బయలుదేరి, అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి ర్యాలీ నిర్వహిస్తారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం అందచేస్తారు.
- నగరిలో మాజీ మంత్రి ఆర్‌కే రోజా ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు టవర్ క్లాక్ సెంటర్‌లోని మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి.. అక్కడి నుంచి నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులతో కలిసి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ చేస్తారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చి, ఓంశక్తి ఆలయ కూడలి మీదుగా రాజశేఖరరెడ్డి విగ్రహం వరకు ర్యాలీ చేపట్టనున్నారు.



- గంగాధర నెల్లూరులో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి సమక్షంలో అయిదు మండలాల్లోని నాయకులు ఉదయం 9 గంటలకు కొత్తపల్లెమిట్టకు చేరుకుంటారు. అక్కడి నుంచి బైక్ ర్యాలీగా వెళ్లి గంగాధర నెల్లూరులో అధికారులకు వినతిపత్రం ఇస్తారు.
- పూతలపట్టు నియోజకవర్గంలో బంగారుపాళ్యంలో మాజీ ఎమ్మెల్యే డా.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు పార్టీ కార్యకర్తలు, ప్రజలతో కలిసి అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తారు. అనంతరం కార్యాలయం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం అందజేస్తారు.
- పలమనేరులో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు పట్టణ నడిబొడ్డు నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తారు. అనంతరం కార్యాలయం ఎదుట నిరసన తెలిపి వినతిపత్రం ఇస్తారు.
- కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో ఉదయం 10 గంటలకు ఆర్టీసీ బస్టాండులోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించి ర్యాలీగా బయలుదేరుతారు. తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేయాలని వినతిపత్రం ఇస్తారు.

'ఖాకీ'లపై ప్రభుత్వం ఒత్తిడి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన వెన్నుపోటు దినంకు ఆ పార్టీ నాయకులు, తటస్థులు వెళ్లకుండా చేయాలని ప్రభుత్వం నుంచి పోలీసులకు అనధికారిక ఆదేశాలు అందాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా 30 యాక్ట్ అమల్లో ఉన్నట్లు పోలీసులు ప్రకటించారు. ర్యాలీలు, ఊరేగింపులు నిషేధిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ ప్రధాన నాయకులను పోలీస్ స్టేషన్లకు పిలిపించి, ర్యాలీలు చేయొద్దని పోలీసులు హుకు జారీ చేస్తున్నారు. అయినా సరే తమ పార్టీ నాయకుడు ఇచ్చిన పిలుపుతో నిరసనలో పాల్గొనే తీరుతామని కార్యకర్తలు పోలీసులకు తెగేసి చెబుతున్నారు.

ఒకే ఒక్కడు

ప్రైవేటు ఆస్తి.. ప్రభుత్వ గుర్తింపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వాడుకునేందుకు మినహా మరే విధంగానూ అక్కరకు రాకుండా ఉన్న కోట్ల విలువైన ఆస్తికి వైఎస్సార్‌సీపీ సర్కారు అధికారిక ముద్ర వేసింది. గత ఐదేళ్ల పాటు జిల్లాలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం నిర్వహించి ఆస్తి యాజమాన్య ధ్రువపత్రాలను అందజేశారు. గ్రామాల్లో ఉండే ఇళ్లు, పశువుల కొట్టాలు, ఇతర ఖాళీ స్థలాలకు వాటి యజమానుల పేరిట సర్టిఫికెట్లు ఇచ్చే బృహత్తర కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ సర్కారు చేపట్టింది. గతంలో ఎవరైనా ఆస్తి అమ్ముకోవాలంటే పెద్ద మనుషులు మధ్య కాగితాలు రాసుకోవాల్సిందే తప్ప ఆ పత్రాలకు ఎలాంటి అధికారిక గుర్తింపు ఉండేది కాదు. అన్నదమ్ములు ఆ ఆస్తిని పంచుకోవాలన్నా ఇబ్బంది ఉండేది. అటువంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకున్న గత వైఎస్సార్‌సీపీ సర్కారు గ్రామ కంఠంలో ఉండే ఇళ్లు, పశువుల కొట్టాలు, ఇతర స్థలాలన్నింటికీ క్యూఆర్ కోడ్ తో కూడిన ఆస్తి సర్టిఫికెట్లను జారీ చేసింది.

జిల్లాలో రెవెన్యూ డివిజన్‌ల వారీగా అమలు చేసిన పథకం వివరాలు

డివిజన్ పేరు	మండలాలు	లబ్ధి చేకూర్చిన భూమి వివరాలు (ఎకరాల్లో)
చిత్తూరు	304	4,42,219.17
నగరి	107	1,41,125.65
పలమనేరు	201	5,01,855.98
కుప్పం	210	2,16,996.82
మొత్తం	822	13,02,224.62



గత సర్కారులో అందజేసిన ఆస్తి యాజమాన్య ధ్రువపత్రం నమూనా

ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్న మాజీ మంత్రి ఆర్కేరోజా

- మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి : వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం ద్వారా ప్రభుత్వం వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ మంత్రి ఆర్కేరోజా పిలుపునిచ్చారు. మంగళవారం తన నివాసంలో ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా కమిటీల సభ్యులు, నియోజకవర్గ, మున్సిపల్, పార్టీ మండల కమిటీల కార్యవర్గ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, కోఆప్షన్ సభ్యులు, నాయకులతో సమావేశమైన ఆమె బుధవారం చేపట్టబోయే వెన్నుపోటు దినం కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పేరిట హామీలు ఇచ్చి ఏడాది పూర్తయినా ఏదీ పాలక ప్రభుత్వం చెయ్యలేకపోయిందన్నారు. నమ్మి ఓట్లేసిన ప్రజలకు ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందన్నారు. గతంలో మేనిఫెస్టో అంటే పవిత్ర గ్రంథంలా ఉంటే నేడు అది చిత్తు కాగితంలా మారిందన్నారు. ప్రజల ఆవేదన ప్రభుత్వానికి తెలియజేయడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీ, అనుబంధ కమిటీల సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఆర్‌డీఎస్‌ఎస్ పనులపై అసంతృప్తి

- ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలో ఆర్‌డీఎస్ఎస్ పనులపై నిర్లక్ష్యం ఎందుకని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ఎస్ఈ కార్యాలయంలో నిర్మాణ, ఎంఆర్‌టీ విభాగాలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలకు త్రీ ఫేజ్ కరెంటు ఇవ్వాలని ఉద్దేశంతో ఆర్‌డీఎస్ఎస్ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. క్షేత్రస్థాయిలో పనితీరు మందగమనంలో ఉందన్నారు. అసలే పని జరుగుతుందా..? అనే సందేహం వస్తోందన్నారు. ఇకనైన పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుంటే సకాలంలో వాటిని బాగు చేసి పంపాలని ఆదేశించారు. ఎస్‌పీఎంల చుట్టూ తిప్పించుకుంటూ రైతులను ఇబ్బందులు పెట్టవద్దన్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. పాడైన ట్రాన్స్‌ఫార్మర్ రవాణా ఉచితంగా చేయాలన్నారు. జిల్లాకు 15వేల పీఎం సూర్యఘర్ కనెక్షన్స్ ఇవ్వాలని లక్ష్యంగా ఇచ్చారన్నారు. ప్రతి ఏఈ సెక్షన్ పరిధిలో నెలకు 300 యూనిట్లు వాడుతున్న 10 మంది వినియోగదారులను కలవాలన్నారు. బీసీలకు అదనంగా రూ.20 వేలు ప్రభుత్వం రాయితీ ఇస్తోందన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ జగదీష్, నిర్మాణ, ఎంఆర్‌టీ విభాగాల ఈఈలు అమర్‌బాబు, బాబు, ఏఓ ప్రసన్న ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

క్లుప్తంగా

టీబీపై అప్రమత్తం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజలు టీబీ నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో టీబీ ముక్త భారత అభియాన్ అవగాహన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో టీబీ నివారణపై పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక చికిత్సలు అందించాలన్నారు. టీబీ వ్యాధి నివారణపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి సుధారాణి, జెడ్పీ సీఈవో రవి కుమార్, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడి పరిశీలన

- జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో కమిటీ విచారణ



విచారణలో రాష్ట్ర కమిటీ సభ్యులు

చిత్తూరు రూరల్(కాణిపాకం) : చిత్తూరు ప్రభుత్వాసుపత్రిని మంగళవారం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ (డీఎస్‌హెచ్) జాయింట్ కమిషనర్ రమేష్‌నాథ్ టీం కలిసి పరిశీలించారు. విచారణ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్తుత్తిగా సాగింది. ఈ సందర్భంగా వారు వార్డు, బ్లడ్‌బ్యాంకు, స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అపోలో ఎంఓయూ ప్రకారం నిర్వహణ నడుస్తోందా లేదా చూశారు. అక్కడే ఉన్న వైద్య సిబ్బందితో ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అలాగే డీసీహెచ్ఎస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ వైద్య సిబ్బందిని సేవల వివరాలను అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టాఫ్ నర్సులు, ఇతర వైద్య సిబ్బంది కొరత ఉందని, ఉన్న సిబ్బందికి పనిభారం పడుతోంది. దీనిపై కూడా ఎటువంటి చర్చ జరగకపోవడంతో వారు అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. వారి వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషశ్రీ, ఆర్ఎంవో సంధ్య, అపోలో యూనిట్ హెడ్ నరేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు



అన్నదానాన్ని పరిశీలిస్తున్న ఈఓ పెంచల కిషోర్

కాణిపాకం : వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకునే భక్తులకు ఇబ్బందులు కలిగిస్తే ఊరుకునేది లేదని ఈఓ పెంచల కిషోర్ హెచ్చరించారు. కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి క్షేత్రానికి సంబంధించిన పలు నిర్వహణలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిత్య అన్నదానం, పాదరక్షకులు , లగేజీ బ్యాగులను ఉంచే కౌంటర్లలను క్షుణంగా పరిశీలించారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విత్తనంపై పెత్తనం

- టోకెన్లు ఇవ్వాలని కూటమి నేతల హుకుం జారీ
- జిల్లాకు అరకొరగా వేరుశనగ విత్తన కాయలు
- నేటి నుంచి రిజిస్ట్రేషన్లు, పంపిణీ ప్రారంభం
- ఎమ్మెల్యేల చేతుల మీదుగా పంపిణీకి శ్రీకారం
- నిజమైన రైతులకు మొండిచేయి

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాలో నేటి నుంచి వేరుశనగ విత్తన పంపిణీకి అధికారులు శ్రీకారం చుట్టారు. విత్తన పంపిణీలో కూటమి పెత్తనం అలుముకుంది. ప్రారంభానికి ముందే టోకెన్ల గోల మొదలైంది. కూటమి నేతలు టోకెన్లు తమ చేతిలో పెట్టాలని హుకుం జారీ చేస్తున్నారు. దీంతో నిజమైన రైతులకు వేరుశనగ కాయలు అందని పరిస్థితి నెలకొంది. క్షేత్రస్థాయి సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. దీనికితోడు కొన్ని చోట్ల కూటమి నేతలు, ఎమ్మెల్యే అరకొర విత్తనాలు మాకొద్దని తిరస్కరించారని అధికార వర్గాలు కోడైకూస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో వర్షాధార పంటగా వేరుశనగ పంటను సాగు చేస్తారు. ఈసారి సాధారణ విస్తీర్ణం 35,228 హెక్టార్లు ఉండగా...90 వేల మంది రైతులు వేరుశనగ సాగు చేస్తారని అధికారుల అంచనా. ఇందుకుగాను ప్రభుత్వం జిల్లాకు 25,643 క్వింటాళ్ల వేరుశనగ విత్తనం కేటాయించింది. ఏటా రైతులకు అవసరమైనంత మేర..అంటే 40 వేల క్వింటాళ్ల మేర సరఫరా అయ్యేది. ఈ సారి చాలీచాలినంత విత్తనాలు సరఫరా చేసి ప్రభుత్వం ఖరీఫ్ రైతుల కాడికి సంకెళ్లు వేసింది.

రెండు రోజుల పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియ

జిల్లా వ్యాప్తంగా వేరుశనగ విత్తన పంపిణీకి సంబంధించి బుధవారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఈ క్రమంలోనే కొన్ని చోట్ల



వేరుశనగ విత్తనం నిల్వలు

వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసేందుకు అధికారులు ముహూర్తం ఖరారు చేశారు. కొన్నిచోట్ల ఎమ్మెల్యేల చేతుల మీదుగా కాయలు పంపిణీ చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. బుధవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా పది మంది రైతులకు కాయలు పంపిణీ చేయనున్నారు. రెండు రోజుల పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి ఈనెల 6వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో విత్తనాలు పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యేలు కాయలు పంపిణీ చేసే క్రమంలో ఎక్కడా గొడవలు ఉండకూడదని..ఇలా ప్లాన్ చేశారని అధికార వర్గాలు చెబుతున్నాయి.

కొన్నిచోట్ల అరకొర విత్తనాల తిరస్కరణ?

అరకొరగా వచ్చిన వేరుశనగ విత్తనాలు మాకొద్దంటూ కొన్నిచోట్ల కూటమి నేతలు, ఎమ్మెల్యేలు తిరస్కరించినట్లు తెలుస్తోంది. అరకొరగా ఇస్తే మా పరువు పోతుందని అధికారులకు నివేదించినట్లు తెలుస్తోంది. పూర్తి స్థాయిలో కాయలు ఇస్తే ఇవ్వండి...లేకుంటే వద్దని చెప్పినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. మరో వైపు వారి వద్ద కాయలు పంపిణీకి, పంట సాగుకు పొంతన లేదంటూ అధికారులు వాదిస్తున్నారు. చాలా మంది కాయలను వంటనూనె కోసం తీసుకుంటున్నారని జవాబు ఇస్తున్నారు. ఈసారి కాయలు తీసుకునే వ్యక్తులు విత్తు వేసేలా చూస్తామని, లేనిపక్షంలో అన్నదాత సుఖీభవలో కోత పెడతామని గట్టిగా ప్రచారం చేయిస్తున్నారు.

అయోమయంలో అధికారులు

ఈసారి వర్షాలు బాగానే కురుస్తున్నాయి. అధిక వర్షపాతం ఉందని వాతావరణ శాఖ ఇటీవల వెల్లడించింది. దీంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. వేరుశనగ పంటను విస్తరంగా పండించాలని చూస్తున్నారు. అయితే అందుకు తగ్గట్టు కూటమి ప్రభుత్వం వేరుశనగ విత్తన కేటాయింపు చేయలేదు. ఇక వచ్చిన కాయలను కూటమి నేతలు ముందస్తుగానే ఆర్డర్లు పెట్టుకున్నారు. జిల్లా వ్యవసాయ అధికారులు ఒక్కో సచివాలయానికి 200 నుంచి 260 బ్యాగుల వరకు పంచి పెట్టారు. గతంలో ఒక్కో సచివాలయానికి 400 నుంచి 500 బ్యాగుల వరకు కాయలు ఇచ్చారు. ఈసారి అరకొరగా కాయలు రావడంతో క్షేత్ర స్థాయి సిబ్బంది అయోమయంలో పడ్డారు. ఈ తరుణంలో స్థానిక కూటమి నేతలు 100 నుంచి 150 బ్యాగుల వరకు టోకెన్లు ముందుగానే తమ చేతిల్లో పెట్టాలని హుకుం జారీ చేశారు. కొన్ని చోట్ల అప్పుడే కూటమి నేతలకు ఆర్డర్లు బుక్కయ్యాయి. సిబ్బంది భయపడి నేతల చేతికి టోకెన్లు ఇచ్చేశారని సమాచారం. కొన్ని చోట్ల మండల స్థాయి అధికారులు నేతలకు కొమ్ముకాస్తున్నారు. దీంతో కాయలు నిజమైన రైతులకు అందేలా కనిపించడం లేదు.

దళితులపై దాడులు అమానుషం

- హత్యా రాజకీయాలకు కేరాఫ్ కూటమి ప్రభుత్వం
- అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ కరువు
- మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆగ్రహం



నారాయణస్వామి, మాజీ ఉప ముఖ్యమంత్రి

కార్వేటినగరం : కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చాక దళితులపై దాడులు పెరగడం అమానుషమని మాజీ ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. మంగళవారం పుత్తూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెనాలిలో దళిత, మైనారిటీ వర్గాలకు చెందిన యువకులపై నడి రోడ్డుపై పోలీసులే విచక్షణా రహితంగా దాడులు చేయడం దారుణమన్నారు. అంబేడ్కర్ రాసిన భారత రాజ్యాంగానికి రక్షణ కల్పించాల్సిన పోలీసులే టీడీపీ కార్యకర్తలుగా వ్యవహరిస్తూ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ముందు నుంచి దళితులంటే చిన్న చూపని, ఐక్యంగా ఉన్న మాల మాదిగలను కుల వర్గీకరణ పేరుతో రెండుగా చీల్చి వారిలోని వర్గ పోరును పెంచి పోషిస్తున్నారని విమర్శించారు.

దళిత ప్రజాప్రతినిధులు బాబు చేతిలో కీలుబొమ్మలు

చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతి సారి దళితులపై కక్ష సాధింపు దోరణితో వ్యవహరిస్తారని, దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని బహిరంగా విమర్శించిన చంద్రబాబుకు వత్తాసు పలుకుతున్న కొంత మంది దళితులు ఆత్మ పరిశీలన చేసుకోవాలని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నియోజకవర్గంలో పిఠాపురంలోని ఓ దళిత గ్రామాన్ని అగ్రవర్ణాలు బహిష్కరించడం, అలాగే మంత్రి సొంత గ్రామంలో అంబేడ్కర్ చిత్రపటాన్ని అడ్డుకున్నప్పుడు దళిత ప్రజా ప్రతినిధులుగా ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు ఏమయ్యారని ఆయన ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులుగా ఎంపికైన వారు నేడు చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారారని విమర్శించారు. దళితులకు సమానత్వం కావాలంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. పేదలకు ఎక్కడ అన్యాయం జరిగినా జగనన్న అండగా నిలుస్తున్నారన్నారు. హోం మంత్రి హోదాలో ఉంటున్న దళిత మహిళ అనిత చంద్రబాబు భజన చేస్తున్నారు తప్ప, దళితులపై జరుగుతున్న దాడులను ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు.

తోతాపురి మామిడికి గిట్టుబాటు ధరలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : రెండు నెలలుగా మామిడి గిట్టుబాటు ధరపై కొనసాగుతున్న చర్చలకు మంగళవారం ధరను నిర్ణయించారు. కలెక్టరేట్‌లో మామిడి రైతులు, మామిడి పరిశ్రమల నిర్వాహకులతో సుదీర్ఘ చర్చలు నిర్వహించారు. ఈ చర్చల్లో కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ.. మామిడి రైతులు, గుజ్జు పరిశ్రమల యాజమాన్యం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించిన తర్వాత గిట్టుబాటు ధర నిర్ణయించామన్నారు. తోతాపురి మామిడికి టన్నుకు రూ.12 వేలు గిట్టుబాటు ధరగా నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలో అత్యధికంగా తోతాపురి మామిడి పంట పండుతోందన్నారు. మామిడి రైతులకు, పరిశ్రమల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గిట్టుబాటు ధర నిర్ణయించినట్లు చెప్పారు. తప్పనిసరిగా అన్ని పరిశ్రమల్లో గిట్టుబాటు ధరను అమలు చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్, మురళీ మోహన్, మామిడి పరిశ్రమల నిర్వాహకులు, ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఖాళీలు పకడ్బందీగా నమోదు చేయాలి



సమస్యలను ఆర్జేడీ శ్యామూల్‌కు వివరిస్తున్న సంఘం నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ల ఖాళీల వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని ఆర్జేడీ శామ్యూల్ అధికారుల ను ఆదేశించారు. స్థానిక డీఈవో కార్యాలయం వద్ద ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపడుతున్న ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియలో భాగంగా స్కూల్ అసిస్టెంట్ల ఖాళీల వివరాల నమోదును ఆయన మంగళవారం పరిశీలించారు. క్లస్టర్ పాఠశాలలు, ఇతర ఉన్నత పాఠశాలల్లో ఖాళీలను నమోదు చేసేటప్పుడు సంబంధిత ఉపాధ్యాయుల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్జీటీల కౌన్సెలింగ్ నిర్వహణ తదితర బదిలీ అంశాలపై ఆయన డీఈవో వరలక్ష్మి, ఏడీ-2 వెంకటేశ్వరరావు, చిత్తూరు, తిరుపతి డీవైఈఓలు ఇందిర, బాలాజీ, తదితర అధికారులతో చర్చించారు.

జాబితాలో జాప్యం నివారించండి

ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు సంబంధించి సీనియారిటీ, ఖాళీల జాబితాలను ప్రదర్శించడంలో జాప్యం జరుగుతోందని ఆర్జేడీ శామ్యూల్‌కు ఎస్టీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు. వెబ్ ఆప్షన్ల నమోదుకు సమయం చాలా తక్కువగా ఉందన్నారు. జాబితాల ప్రదర్శనలో జాప్యం కారణంగా ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొందని చెప్పారు. డీఎస్సీ-2008 ఉపాధ్యాయులకు కామన్ సీనియారిటీ తేదీని పరిగణలోకి తీసుకుని న్యాయం చేయాలని తెలిపారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీల ఖాళీల ఎంపికపై స్పష్టత ఇవ్వాలని ఆర్జేడీకి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయ సంఘనేతలు పలు సమస్యలను ఆర్జేడీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు గంటా మోహన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్‌రెడ్డి, మోహన్, నాయకులు లింగమూర్తి, రమణారెడ్డి పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం



సైక్లింగ్‌లో పాల్గొని సర్టిఫికెట్లు అందుకున్న నగరవాసులు

- నగరంలో ప్రపంచ సైకిల్ దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్ : ఆరోగ్యానికి అసలైన టానిక్ సైక్లింగ్ అని ఎస్పీ సతీమణి హర్షిత అన్నారు. నేచర్ లవర్స్ అసోసియేషన్, సైక్లింగ్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ సైకిల్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్పీ సతీమణి హర్షిత జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం అత్యంత ప్రధానమన్నారు. అదే విధంగా సైక్లింగ్ ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. ప్రస్తుత రోజుల్లో బిజీ లైఫ్‌లో చాలా మంది వ్యాయమానికి దూరమవుతున్నారన్నారు. ఆహార అలవాట్లలో మార్పులు, శారీరక శ్రమ తక్కువ కావడం, గంటల తరబడి ఒకే దగ్గర కూర్చోవడం వంటివి అనారోగ్యానికి దారి తీస్తాయన్నారు. రోజులో గంటల తరబడి వ్యాయామం చేయకపోయినా ప్రతి రోజు కొద్ది సేపు సైక్లింగ్ చేయడం ఆరోగ్యానికి మంచిదన్నారు. అనంతరం కొంగారెడ్డిపల్లి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. సైక్లింగ్ పాల్గొన్న సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నేచర్ లవర్స్ అసోసియేషన్ సభ్యులు మురళి, సైక్లింగ్ అసోసియేషన్ సభ్యులు వినోద్, డాక్టర్ భరత్‌రెడ్డి, డాక్టర్ జయంత్, సురేంద్రరెడ్డి, ఏలుమలై, సునీల్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో డీఈ బదిలీ

చిత్తూరు కార్పొరేషన్ : ట్రాన్స్‌కో పలమనేరు సబ్ డివిజన్ డీఈ చిన్నబ్బను బదిలీ చేస్తూ సీఎండీ సంతోషరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ప్రాజెక్టు విభాగానికి స్థాన చలనం కల్పించారు. కాగా ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

ముగిసిన కార్యదర్శుల బదిలీ

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల బదిలీ కౌన్సెలింగ్ మంగళవారంతో ముగిసింది. జెడ్పీ సమావేశ మందిరంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రేడ్-4 కార్యదర్శులు 120 మందిని బదిలీ చేశారు. ఇందులో 5 ఏళ్ల ఒకే చోట పనిచేసినవారు, రిక్వెస్ట్‌పై బదిలీలు కోరినవారు ఉన్నారని డీపీఓ సుధాకర్‌రావు తెలిపారు. సచివాయ కార్యదర్శులకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చాక బదిలీలు చేపడతామని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

పుత్తూరు : మండల పరిధిలో పరమేశ్వరమంగళం గ్రామం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు తమిళనాడు రాష్ట్రం మధురైకి చెందిన అబ్బాస్(45) అనే వ్యక్తి నగరి నుంచి పుత్తూరుకు బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు. మృతుడు పుత్తూరులో పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నేపథ్యంలో ఈ దుర్ఘటన జరిగింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'వెన్నుపోటు' ప్లకార్డుల ఆవిష్కరణ



ప్లకార్డును ఆవిష్కరిస్తున్న భూమన

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగడుతూ బుధవారం చేపట్టనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన ప్లకార్డులను వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం తిరుపతి పద్మావతిపురంలో నివాసంలో ఆయన మాట్లాడుతూ బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేలా నిరసన వ్యక్తం చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం.. చేసింది శూన్యం



మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి, పక్కన ఎంపీ గురుమూర్తి, మేడా రఘునాథరెడ్డి, అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యమని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి విమర్శించారు. మంగళవారం తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో ఎంపీ గురుమూర్తి, తిరుపతి పార్లమెంట్ పరిశీలకుడు మేడా రఘునాథరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై బుధవారం వెన్నుపోటు దినం పాటిస్తున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాసంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసి వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధింపులకు పాల్పడుతోందని మండిపడ్డారు. ఏడాది పాలనలో 800 మందికి పైగా వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు, అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన జూన్ 4వ తేదీని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెన్నుపోటు దినంగా నామకరణం చేశారని, ఆ మేరకు తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కలెక్టరేట్లు, ఆర్డీఓ కార్యాలయాల నిరసనలు తెలిపి వినతిపత్రాలు సమర్పించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, స్వచ్ఛందంగా ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మామిడి మార్కెట్‌కు కళ



చిత్తూరు మార్కెట్‌లో మామిడి కాయలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు నగరంలోని మామిడి కాయల మార్కెట్‌లో మంగళవారం సందడి నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు మార్కెట్‌కు కాయలు క్యూ కట్టాయి. సుమారు 35 టన్నుల వరకు కాయలు వచ్చాయని ట్రేడర్ల అంచనా. అధికంగా బేనీషా, తోతాపురి (టేబుల్‌రకం) భారీగా వచ్చాయి. అలాగే చందూర, ఇమామ్ పసంద్, అల్ఫోన్సో, కాలేపాడు వంటి రకాలు అధికంగా చేరాయి. అయితే ధరలు మాత్రం రైతులను నిరాశ పరిచాయి. గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు మామిడిపై ఆశలు వదులుకున్నారు. ఇక ట్రేడర్లు కొనుగోలు చేసిన మామిడి అన్ని కూడా ఫ్యాక్టరీలకు కాకుండా గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు అమ్ముడుబోయాయి.

తిరుపతి జిల్లాలో కోవిడ్ కేసు

- పది నెలల చిన్నారికి పాజిటివ్

తిరుపతి తుడా : తిరుపతి జిల్లాలో కోవిడ్ కలకలం రేగింది. తొలి కేసు మంగళవారం నమోదు కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పది నెలల చిన్నారికి కరోనా పాజిటివ్ గా నిర్ధారణైంది. ఏర్పేడు మండలం పాపానాయుడుపేట ఎస్టీ కాలనీకి చెందిన చిన్నారికి జ్వరం రావడంతో చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆర్టీపీసీఆర్ పరీక్షలో చిన్నారికి పాజిటివ్ వచ్చింది. ప్రస్తుతం చిన్నపిల్లల ప్రత్యేక వార్డులో పసిబిడ్డకు చికిత్స అందిస్తున్నారు. కోవిడ్ తీవ్రత సాధారణ స్థితిలోనే ఉందని వైద్యులు తెలిపారు.

మరో యువకుడికి..

మదనపల్లెకు చెందిన 25 ఏళ్ల యువకుడు కేరళలోని తిరువనంతపురంలో ఉద్యోగం చేస్తున్నాడు. గత శుక్రవారం ఆ యువకుడు అనారోగ్యం బారిన పడడంతో తిరువనంతపురంలోని ఆస్పత్రికి వెళ్లగా కోవిడ్ నిర్ధారణ పరీక్ష నిర్వహించారు. పాజిటివ్గా తేలడంతో హోమ్ ఐసోలేషన్లో ఉండాలని వైద్యులు సూచించారు. దీంతో ఆ యువకుడు తన సొంత ఊరు మదనపల్లెకు వచ్చాడు. ఈ క్రమంలో కోవిడ్ పరీక్ష కోసం మంగళవారం రుయాలోని కోవిడ్ కేంద్రానికి తీసుకువచ్చారు. ర్యాపిడ్ పరీక్షల్లో నెగటివ్ రావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 84,418 మంది స్వామివారిని దర్శించుకోగా 34,900 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.89 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం అవుతుండగా టిక్కెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం పూర్తవుతోంది.